మెథడిస్ట్ ఇంజినీరింగ్ కళాశాల


మెథడిస్ట్ ఇంజినీరింగ్ కళాశాలలో అధ్యాపకులు, విద్యార్థులు

ఇంజినీరింగ్‌కు బెస్ట్ మెథడిస్ట్

కళాశాలలో సీటు పొందేందుకు విద్యార్థుల పోటీ

దేశ, విదేశాల్లో స్థిరపడుతున్న విద్యార్థులు

- అత్యున్నత ప్రమాణాలతో తరగతుల నిర్వహణ
- క్యాంపస్ రిక్రూట్‌మెంట్‌తో ప్రముఖ సంస్థల్లో ఉద్యోగాలు

అబిడ్స్, ఆగస్టు 11: ఇంజినీరింగ్ విద్యలో మెథడిస్ట్ కాలేజీకి ఉన్న పేరు ప్రఖ్యాతలు అన్నీఇన్నీ కావు. ఎన్‌బీఏ అక్రిడిటేషన్, న్యాక్, స్వయం ప్రతిపత్తి హోదా సాధించిన ఈ కాలేజీ రాష్ట్రంలోని ప్రముఖ ఇంజినీరింగ్ కాలేజీల సరసన నిలుస్తున్నదంటే అతిశయోక్తి కాదు. నగరం నడిబొడ్డున 2008లో స్థాపించిన మెథడిస్ట్ ఇంజినీరింగ్ కళాశాలకు రోజురోజుకూ ఆదరణ పెరుగుతున్నది. కళాశాల కరస్పాండెంట్ కె.కృష్ణారావు విద్యార్థులకు నాణ్యమైన వృత్తి విద్యనందించేందుకు చర్యలు తీసుకుంటుండటంతో ప్రతి ఏడాది ఉత్తీర్ణత శాతం పెరుగుతున్నది. ఉస్మానియా యూనివర్సిటీ అనుబంధంతో విశాలమైన స్థలంలో కాలేజీ స్థాపించిన యాజమాన్యం విద్యార్థులకు అత్యాధునిక తరగతులు, వేలాది పుస్తకాలతో లైబ్రరీ హాల్, డిజిటల్ లైబ్రరీ, కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటుతోపాటు విశాలమైన కాన్ఫరెన్స్ హాల్‌ను నిర్మించారు. అనుభవం ఉన్న ప్రొఫెసర్లు, పీహెచ్‌డీలు, ఫ్యాకల్టీల ద్వారా విద్యార్థులకు ఉత్తమ విద్యాబోధన అందిస్తున్నారు. విద్యార్థుల్లో కమ్యూనికేషన్ స్కిల్స్, వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించేందుకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఇక్కడి విద్యార్థులు ఓయూ స్థాయిలో గోల్డ్‌మెడల్స్ సాధించడంతోపాటు పలు ర్యాంకులు సాధించి కళాశాల పేరు ప్రతిష్టలను పెంపొందిస్తున్నారు. అంతేగాక ఇంజినీరింగ్ పూర్తి కాగానే క్యాంపస్ రిక్రూట్‌మెంట్ ద్వారా ప్రముఖ సంస్థల్లో ఉద్యోగాలు సాధించి ఉన్నత స్థానాల్లో స్థిరపడుతున్నారు.

ఉన్నత స్థాయి ఉద్యోగాలకు ఎంపిక..

మెథడిస్ట్‌లో ఇంజినీరింగ్ పూర్తి చేసిన విద్యార్థులకు తప్పకుండా ఉద్యోగం లభించేలా కళాశాల యాజమాన్యం, కళాశాల కరస్పాండెంట్ కె.కృష్ణారావు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ఈ కళాశాలలో ప్రారంభించినప్పటి నుంచి ప్రతి ఏడాది విద్యార్థులు క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ ద్వారా ఉద్యోగాలు సాధిస్తూనే ఉన్నారు. దేశ, విదేశాలకు చెందిన పలు కార్పొరేట్, సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో ఉన్నత హోదాల్లోని ఉద్యోగాలకు ఎంపిక అవుతూ అత్యధిక ప్యాకేజీ పొందుతుండటం విశేషం.

ప్రతి ఏడాది క్యాంపస్ రిక్రూట్‌మెంట్‌లు..

మెథడిస్ట్ ఇంజినీరింగ్ కళాశాలలో ప్రతి సంవత్సరం దేశ, విదేశాలకు చెందిన కంపెనీలు క్యాంపస్ రిక్రూట్‌మెంట్‌లు నిర్వహిస్తున్నాయి. రకుటెన్, హెచ్‌పీ, డీటెక్ డిజిటల్, సేల్స్‌ఫోర్స్, టెక్ మహీంద్రా, అమెజాన్, హెచ్‌సీఎల్, ఎస్ఏపీ, బ్లూ సీ ఇండస్ట్రీస్, జీనోసిస్, విప్రో, ఐబీఎం, హిందుస్థాన్ గ్లోబల్, ఐసీఐసీఐ, జెన్‌ప్యాక్ట్ తదితర కంపెనీలు క్యాంపస్ రిక్రూట్‌మెంట్ నిర్వహించి విద్యార్థులను ఎంపిక చేస్తున్నాయి. సీనియర్ విద్యార్థులు తమ ప్రతిభాపాటవాలతో ఉన్నతస్థాయిల్లో ర్యాంకులు, ఉద్యోగాలు సాధిస్తుండటంతో జూనియర్ విద్యార్థులు ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగుతున్నారు.

ప్రొఫెషనల్స్‌గా తీర్చిదిద్దుతున్నాం..

మా కళాశాలలోని విద్యార్థులను అన్ని రంగాల్లో తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నాం. ఉద్యోగాల సాధనకు ప్రత్యేక తరగతుల నిర్వహణతోపాటు ఉద్యోగ ప్రవేశ పరీక్షల్లో సునాయాసంగా నెగ్గేలా శిక్షణ ఇప్పిస్తున్నాం. ఈ క్యాంపస్‌లో తరగతి గదులు, అత్యాధునిక కంప్యూటర్ ల్యాబ్‌లు, వేలాది పుస్తకాలతో లైబ్రరీ సదుపాయాన్ని కల్పిస్తున్నాం. కళాశాలకు సకాలంలో చేరుకునేలా రవాణా సౌకర్యం కల్పిస్తున్నాం. ఇంజినీరింగ్‌లో ఉత్తీర్ణతా శాతం పెంచడంతోపాటు ప్లేస్‌మెంట్ సైతం కల్పిస్తున్నాం.

– కె.కృష్ణారావు, మెథడిస్ట్ ఇంజినీరింగ్ కళాశాల కరస్పాండెంట్

మంచి ప్యాకేజీతో ఉద్యోగం సాధించా..

మెథడిస్ట్ ఇంజినీరింగ్ కళాశాలలో ఏఐ డేటా సైన్స్ కోర్సులో చేరిన నేను ప్రొఫెసర్లు, ఫ్యాకల్టీ ప్రోత్సాహంతో సేల్స్‌ఫోర్స్‌లో సాలీనా 9 లక్షల ప్యాకేజీతో ఉద్యోగాన్ని సాధించాను. ఇంజినీరింగ్ విద్యా బోధనతోపాటు ప్రత్యేక తరగతులను నిర్వహించి క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌లో నెగ్గేలా కాలేజీ యాజమాన్యం నన్ను తీర్చిదిద్దారు. నగరంలో కాలేజీ ఉండటంతో గంటల తరబడి ప్రయాణం చేసే సమయం తగ్గడంతోపాటు సమయానికి కాలేజీకి చేరేవాళ్లం.

– అర్చన, పూర్వ విద్యార్థి

ప్రత్యేక తరగతులు ఉపయోగపడ్డాయి..

మెథడిస్ట్ ఇంజినీరింగ్ కళాశాలలో సీఎస్ఈ కోర్సును పూర్తి చేసి టీటెక్‌లో ఉద్యోగాన్ని సాధించా. ఫ్యాకల్టీ ప్రోత్సాహం, ప్లేస్‌మెంట్ ట్రైనింగ్.. ఉద్యోగం రావడానికి ఎంతో ఉపయోగపడ్డాయి. రోజు ప్రత్యేక తరగతులు నిర్వహించడంతోపాటు ప్రవేశ పరీక్షల్లో ఎలా మెదులుకోవాలో శిక్షణ ఇచ్చే వారు. ఎక్కడ ఉద్యోగ ఖాళీలు ఉన్నా ఫ్యాకల్టీలు తమకు సమాచారం ఇచ్చే వారు. ఫ్యాకల్టీ ప్రోత్సాహం ఉద్యోగ సాధనకు దోహదపడింది.

– ప్రవళిక, పూర్వ విద్యార్థి

ట్యాంక్‌బండ్‌పై ట్రాఫిక్

ఆదివారం కావడంతో ట్యాంక్ బండ్, సచివాలయం, అమరవీరుల చిహ్నం, ఎన్టీఆర్ పార్క్, అంబేద్కర్ విగ్రహాన్ని వీక్షించేందుకు సందర్శకులు భారీగా తరలివచ్చారు. దీంతో సెక్రటేరియట్–ట్యాంక్‌బండ్ రోడ్డులో ట్రాఫిక్ స్తంభించిచడంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

ట్యాంక్‌బండ్‌పై త్వరలో పాపన్నగౌడ్ విగ్రహం

- ఈనెల 18న గ్రామగ్రామాన పాపన్న జయంతి నిర్వహించాలి
- బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

అభివాదం చేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, జోగి రమేశ్ గౌడ్

రవీంద్రభారతి, ఆగస్టు 11: బహుజన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహాన్ని త్వరలో ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేస్తామని, ఈనెల 18 తేదీ నుంచి పాపన్నగౌడ్ జయంతిని పురస్కరించుకొని గ్రామగ్రామాన వేడుకలు నిర్వహించాలని బీసీ సంక్షేమశాఖ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ అన్నారు. ఆదివారం రవీంద్రభారతిలో జైగౌడ్ ఉద్యమ జాతీయ కమిటీ ఆధ్వర్యంలో పాపన్నగౌడ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. జైగౌడ్ ఉద్యమ జాతీయ అధ్యక్షుడు వట్టికూట రామారావుగౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్, మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్, ఏపీ మాజీ మంత్రి జోగి రమేశ్‌గౌడ్ పాల్గొని జ్యోతిప్రజ్వలన చేసి పాపన్నగౌడ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ మాట్లాడుతూ.. పాపన్నగౌడ్ గౌడ్ కులానికే కాదు బహుజనులందరికీ గొప్ప నాయకుడని, బహుజన రాజ్యం కోసం నిజాం పాలకులపై పోరాడిన గొప్ప పోరాటయోధుడని, పాపన్నగౌడ్‌ను నేటి యువతరం స్ఫూర్తిగా తీసుకొని రాజకీయాల్లో ఎదగాలని ఆయన పిలుపునిచ్చారు. మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. బహుజన రాజ్యం కోసం జీవితాన్నే త్యాగం చేసిన గొప్ప మహనీయుడు పాపన్నగౌడ్ అని, పాపన్న గౌడ్ విగ్రహం ఏర్పాటుకు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే అమల్లోకి తెచ్చామని, గౌడ భవన్‌కు కోకాపేటలో ఐదు కోట్ల విలువైన భూమిని కేటాయించామని తెలిపారు. పార్టీలకతీతంగా బహుజన వీరుడు పాపన్నగౌడ్ జయంతిని నిర్వహించాలన్నారు. గౌడ కులస్తులకు వైన్ షాపుల్లో 15 రిజర్వేషన్లు ఇచ్చిన ఘనత తమకే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జైగౌడ్ జాతీయ అధ్యక్షుడు వట్టికూట రామారావుగౌడ్, బీజేపీ రాష్ట్ర నేత తూళ్ళ వీరేందర్ గౌడ్, మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్య గౌడ్, సిల్వేర్ నారాయణగౌడ్, రాజ్‌కుమార్ గౌడ్, వివిధ రాష్ట్రాల గౌడ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై ఉద్యమించండి

- పీడీఎస్‌యూ(విజృంభణ)రాష్ట్ర కార్యదర్శి అల్లూరి విజయ్

ఓయూ ఆర్ట్స్ కళాశాల ముందు కరపత్రాన్ని విడుదల చేస్తున్న పీడీఎస్‌యూ నేతలు

సికింద్రాబాద్, ఆగస్టు 11: రాష్ట్రంలోని విద్యారంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి విద్యార్థి లోకం ఉద్యమాలకు సిద్ధం కావాలని పీడీఎస్‌యూ(విజృంభణ) రాష్ట్ర కార్యదర్శి అల్లూరి విజయ్ పిలుపునిచ్చారు. దానిలో భాగంగానే ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీ ముందు పీడీఎస్‌యూ(విజృంభణ) విద్యార్థుల ఆధ్వర్యంలో కరపత్రాలు ఆవిష్కరించారు. విద్యాలయాల్లో ఏండ్ల తరబడి నెలకొన్న సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నాయని మండిపడ్డారు. ప్రభుత్వం విద్యా వ్యవస్థను పూర్తిగా కార్పొరేట్ పరం చేయడమేగాకుండా ప్రైవేట్ యూనివర్సిటీలను ప్రోత్సహిస్తుందన్నారు. ఇందులో భాగంగానే యూనివర్సిటీలో బోర్డు కమిటీ నియమించడం జరుగుతుందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులు చదువుతున్న పాఠశాలలకు హాస్టళ్లకు పక్కా భవనాలు లేవని, ఉన్నా అవి శిథిలావ్యవస్థలో ఉన్నాయని వివరించారు. రాష్ట్రంలో విద్యారంగానికి సంబంధించిన విద్యాశాఖ మంత్రి లేరని తెలిపారు. యూనివర్సిటీల్లో వైస్ చాన్సలర్ల నియామకం చేపట్టడంలేదని, కమిటీల పేరుతో కాలక్షేపం చేస్తూ వస్తున్నదని, ప్రభుత్వం యూనివర్సిటీల్లో విద్యార్థులకు సరిపడా ప్రొఫెసర్స్ గాని, నాన్ టీచింగ్ స్టాఫ్ గాని లేరన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇకనైనా విద్యాశాఖ మంత్రిని, యూనివర్సిటీలకు వైస్ చాన్సలర్లను నియమించాలని, లేనిపక్షంలో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ ఏపూరి పవన్, పాలేష్, భద్రం, వీరబాబు పాల్గొన్నారు.

నేషనల్ ట్రాన్సిట్ పర్మిట్ సిస్టంలో మార్పులు చేయాలి

తెలుగు యూనివర్సిటీ, ఆగస్టు 11: నేషనల్ ట్రాన్సిట్ పర్మిట్ సిస్టంలో మార్పులు చేయాలని జీఎస్‌టీ వే బిల్లు మాదిరిగా ఫార్మ్ II పర్మిట్ వెంటనే ఆన్‌లైన్‌లో తీసుకురావాలని తెలంగాణ టింబర్ మర్చంట్స్ సామిల్ అల్లైడ్ ఇండస్ట్రీస్ రాష్ట్ర అధ్యక్షుడు చకిలం రమణయ్య రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. నాంపల్లిలోని ఫ్యాప్సీ భవన్‌లో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఫార్మ్ II పర్మిట్ ఆన్‌లైన్‌లో వచ్చే వరకు మాన్యువల్ బిల్స్ ఇవ్వాలని కోరారు. సామిల్ రూల్‌లో జీవో 69లో లేని సిస్టమ్‌ను వ్యాపారస్తులు పర్మిట్ ద్వారా ఖరీదు చేసి దిగుమతి చేసుకున్న టింబర్‌ను 24 గంటల్లో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్‌కు తెలియజేయాలన్నారు. కలప కోత మిషన్‌లో దుగోడ మిషన్ అనుమతి ఇవ్వాలని గ్రౌండ్ స్టాక్ అనే అంశాన్ని జీఓ 69 నుంచి తీసి వేయాలన్నారు. సా మిల్లు లైసెన్స్‌లు రెన్యువల్ అప్లికేషన్‌లో ఫార్మ్ IIIలో జీఎస్‌టీ, ఐటీ రిటర్న్స్ అడుగుతున్నారని, వాటిని మినహాయింపు ఇవ్వాలన్నారు. రాష్ట్రంలోని 33 జిల్లాల కలప వ్యాపారస్తులు టింబర్ డిపోల, సా మిల్లర్లు ఈ సమావేశంలో హాజరై ఈ ప్రతిపాదనలను బలపరిచారు. ఈ సమావేశంలో ఆలిండియా టింబర్ ఫెడరేషన్ అడ్వైజర్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, అన్ని జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు, కోశాధికారులు, ప్రధాన కార్యదర్శి గోపి కృష్ణ, కోశాధికారి పురుషోత్తం పటేల్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న తెలంగాణ టింబర్ మర్చంట్స్ సామిల్ అల్లైడ్ ఇండస్ట్రీస్ రాష్ట్ర అధ్యక్షుడు చకిలం రమణయ్య

మాదిగలకు 12శాతం రిజర్వేషన్లు కల్పించాలి

సమావేశంలో మాట్లాడుతున్న పిడమర్తి రవి

ఖైరతాబాద్, ఆగస్టు 11: మాదిగలకు 12శాతం రిజర్వేషన్లు కల్పించి అసెంబ్లీలో చట్టబద్ధత చేయాలని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్, మాదిగ జేఏసీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి అన్నారు. బంజారాహిల్స్‌లోని బాబు జగ్జీవన్‌రామ్ భవన్‌లో తెలంగాణ మాదిగ సంఘాల సదస్సులో ఆయన మాట్లాడారు. 1994 జనాభా లెక్కల ప్రకారం మాదిగలు 7శాతం ఉన్నారని, 2014లో గత ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వేలో 12శాతం ఉన్నట్లు లెక్కలు వచ్చాయన్నారు. ఆ జనాభా లెక్కల ప్రకారం మాదిగలకు 12శాతం రిజర్వేషన్లు కల్పించకుంటే ఎస్సీ వర్గీకరణ జరిగినా ఎలాంటి లాభం ఉండదన్నారు. సుప్రీం కోర్టు ఎస్సీ వర్గీకరణను రాష్ట్రాలు చేసుకోవచ్చని తీర్పునివ్వడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. త్వరలోనే పది లక్షల మంది మాదిగలతో నగరంలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి ఎ.చంద్రశేఖర్, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి సంపత్‌కుమార్, రేపల్లి మోహన్, సతీశ్ మాదిగ, డాక్టర్ చారకొండ వెంకటేశ్, గాయకుడు ఏపూరి సోమన్న, ఎమ్మార్పీఎస్ నాయకురాలు మేరీ మాదిగ, అంబేద్కర్ సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాపోలు రాములు, ప్రొఫెసర్ దయాకర్, ప్రొఫెసర్ ముత్తయ్య, ప్రొఫెసర్ పురుషోత్తం, మాదిగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గడ్డ యాదయ్య, మాదిగ శక్తి అధ్యక్షుడు సురేందర్ సన్నీ, బోరెల్లి సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆచార్య మురళీధర్‌రావును అభినందిస్తున్న హాస్య నటుడు బ్రహ్మానందం

కవిత్వానికి వర్గ, వర్ణ బేధాలుండవు

- హాస్య నటుడు బ్రహ్మానందం

రవీంద్రభారతి, ఆగస్టు11: కవిత్వానికి వర్గ, వర్ణ బేధాలుండవని హాస్య నటుడు బ్రహ్మానందం అన్నారు. రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో కిన్నెర ఆర్ట్స్ థియేటర్స్, ఆజో–విభో–కుందాళం ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆచార్య ఏలూర్పి మురళీధరరావు రచించిన వాఙ్మయ చరిత్రలో కొన్ని వ్యాస ఘట్టాలు, విశేషాంశాలు పుస్తక పరిచయ సభ జరిగింది. తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ ఉపాధ్యక్షుడు కవి ఆచార్య అనుమాండ్ల భూమయ్య అధ్యక్షతన జరిగిన సభలో ప్రముఖ హాస్య నటుడు బ్రహ్మానందం మాట్లాడుతూ.. ఇలాంటి పుస్తకాలు తరతరాలకు తలమానికంగా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో జేఎస్.మూర్తి, గిరిజమనోహర్, మాశర్మ, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి, అప్పాజోస్యుల సత్యనారాయణ, కిన్నెర కార్యదర్శి ముద్దాళి రఘురామ్ తదితరులు పాల్గొన్నారు.

దేవుళ్ల పాత ఫొటోల సేకరణ విజయవంతం

శిబిరంలో వినియోగంలో లేని వస్తువులతో ఏవీసీఐ ప్రతినిధులు

అమీర్‌పేట్, ఆగస్టు 11: ఆర్యవైశ్య కమ్యూనిటీ ఇంటర్నేషనల్(ఏవీసీఐ)ఆధ్వర్యంలో ఆదివారం సనత్‌నగర్ హనుమాన్ దేవాలయ ఆవరణలో వినియోగించని దేవుళ్ల ఫొటోలు, విగ్రహాలు, క్యాలెండర్లు ఇతరత్రా వస్తువులు సేకరించేందుకు చేపట్టిన శిబిరం విజయవంతమైంది. ఉదయం 8 నుంచి సాయంత్రం 3గంటల వరకు ఈ శిబిరంలో దాదాపు 350కి పైగా ఫొటోలు, ఆధ్యాత్మిక పుస్తకాలు, క్యాలెండర్లు, పూజా సామన్లు, విగ్రహాలను అందజేశారు. ఈ సందర్భంగా ఏవీసీఐ వ్యవస్థాపక చైర్మన్ కేఎస్ఆర్ మూర్తి మాట్లాడుతూ.. ఇంట్లో ఏడాదికి ఒకసారి కూడా వినియోగించని దేవుళ్లకు చెందిన వస్తువులు, ఫొటోలు శుభ్రం చేసి తిరిగి అటకెక్కించడం వల్ల నెగిటివ్ ఎనర్జీ వ్యాపించడం తప్ప ప్రయోజనం ఉండదని, ఆ వస్తువులను తమ సంస్థ ద్వారా సేకరించి పవిత్రమైన ఆయా వస్తువులకు శాస్త్రోక్తంగా విసర్జన, ఉద్వాసన పూజలు నిర్వహించిన అనంతరం, ఆయా ఫొటోలకు చెందిన ఫ్రేమ్‌లు, అద్దాలు తొలగించి దేవుళ్ల చిత్రాలను పవిత్ర నదీజలాల్లో నిమజ్జనం చేయబడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏవీసీఐ కమిటీ సభ్యులు సరాఫ్ తులసి గుప్తా, నాగేళ్ల కిరణ్ గుప్తా, బీజేపీ సీనియర్ నాయకులు లింగంపల్లి నర్సింగ్‌రావు, నాయకులు ఆకూరి శ్రీనివాస్‌రావు, ఆకుల మహేశ్, కుషాల్, ఆంజనేయులు యాదవ్, ఏవీసీఐ వలంటీర్లు లక్ష్మణ్, అర్చన దంపతులు పాల్గొన్నారు.

ముగిసిన 'ది పీడియాట్రిక్ అనస్థీషియా కనెక్ట్' సదస్సు

'ది పీడియాట్రిక్ అనస్థీషియా కనెక్ట్' సదస్సుకు హాజరైన వైద్యులు

అమీర్‌పేట్, ఆగస్టు11: రెండు రోజుల పీడియాట్రిక్ అనస్థీషియాలజిస్టుల సమావేశం ఆదివారం ముగిసింది. ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ పీడియాట్రిక్ అనస్థీషియాలజిస్ట్స్ (ఐఏపీఏ) తన మిడ్ టర్మ్ సీఎంఈ–2024 'ది పీడియాట్రిక్ అనస్థీషియా కనెక్ట్' అనే అంశంపై బేగంపేట్‌లోని హోటల్ హరిత ప్లాజాలో శని, ఆది వారాల్లో నిర్వహించిన సదస్సుకు దేశవ్యాప్తంగా 150 మందికి పైగా అనస్థీషియాలజిస్టులు, పీడియాట్రిక్ అనస్థీషియాలజిస్టులు, పీడియాట్రిషన్లు హాజరయ్యారు. పీడియాట్రిక్, నియోనాటల్, పెరియమోపరేటివ్ కేర్, ప్రాసీజర్స్‌లో అందుబాటులోకి వస్తున్న ఆధునిక విధానాలపై వైద్యులు లోతుగా చర్చించారు. దేశ జనాభాలో 40శాతం మంది పిల్లలుండగా పీడియాట్రిక్ సర్జికల్, మత్తు మందు సేవలకు గణనీయమైన డిమాండ్ నెలకొందని, ఈ నేపథ్యంలో పీడియాట్రిక్ అనస్థీషియాలజీని అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని సీనియర్ కన్సల్టెంట్ అనస్థీషియాలజిస్ట్, ఐఏపీఏ అధ్యక్షుడు డాక్టర్ రాజా నర్సింగ్‌రావు ఈ సందర్భంగా పేర్కొన్నారు. సమావేశంలో ఐఏపీఏ తెలంగాణ కార్యదర్శి డాక్టర్ కె.శైలజ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన

వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం మాదాపూర్‌లోని శిల్పారామంలో కళాకారుల నృత్య ప్రదర్శనలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. సిద్దేంద్ర కళాపీఠం నాట్య గురువులు డాక్టర్ రుద్రవరం సుధాకర్ శిష్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శనలతో అలరించారు. కళాకారులు వైష్ణవి, నయా ఉపద్రష్ట, శ్రీనిధి, అలేఖ్య, నవ్య మాలెంపాటి గణనాయకమ్, చేరి యశోదకు, జయదేవుని అష్టపది, మధుర మధుర, నమశ్శివాయతేయ్, నీల మేఘ శరీర, పదవర్ణం, పరమపురుషుడు అంశాలను కూచిపూడి నృత్య రూపకంలో చేసి అలరించారు.

– కొండాపూర్, ఆగస్టు 11

మెగా జాబ్ మేళాకు విశేష స్పందన

పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్, లయన్స్ ఇంటర్నేషనల్ క్లబ్, రాంకీ ఫౌండేషన్, నిపుణ స్వచ్ఛంద సంస్థ సంయుక్తాధ్వర్యంలో ఆదివారం కూకట్‌పల్లిలోని జేఎన్‌టీయూలో మెగా జాబ్‌మేళా నిర్వహించారు. ఈ మేళాను జేఎన్‌టీయూ ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ బుర్రా వెంకటేశం, డీసీపీ పి.మధుకర్ స్వామితో కలిసి ప్రారంభించారు. 11,240 మంది అభ్యర్థులు ఉద్యోగాల కోసం రాగా, 105 కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహించాయి. ఐటీ కంపెనీల్లో 450, బ్యాంకింగ్, ఫార్మా సంస్థల్లో 2,650 మంది ఉద్యోగాలు పొందారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు బాబురావు, లక్ష్మీకుమారి, విద్యాభూషణ్, రాంకీ చైర్మన్ రామి రెడ్డి, పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్ కార్యదర్శి సందీప్ హరి తదితరులు పాల్గొన్నారు.

– సిటీబ్యూరో, ఆగస్టు 11(నమస్తే తెలంగాణ)

సీడీఎఫ్‌డీ ఇంక్యుబేషన్ బలోపేతానికి సన్నాహాలు

సిటీబ్యూరో, ఆగస్టు 11(నమస్తే తెలంగాణ) : సెంటర్ ఫర్ డీఎన్ఏ ఫింగర్ ప్రింటింగ్ అండ్ డయాగ్నోస్టిక్స్ ఇంక్యుబేషన్ సెంటర్ బలోపేతానికి సన్నాహాలు చేస్తోంది. ఇంక్యుబేషన్ సెంటర్ ప్రారంభించిన అనతి కాలంలోనే స్టార్టప్‌లను నెలకొల్పేందుకు ఔత్సాహికులు ముందుకొస్తుండగా, లైఫ్ సైన్సెస్ రంగంలో వినూత్న ఆవిష్కరణలను ప్రోత్సహించేలా కార్యాచరణ రూపొందించారు. ఈ క్రమంలో సీడీఎఫ్‌డీ వర్గాలు ప్రత్యేకంగా డీబీటీ–ఐఎల్ఎస్ ఇంక్యుబేషన్ సెంటర్ సహకారం కోరింది. ఇరు సంస్థలు కలిసి హైదరాబాద్ వేదిక బయో స్టార్టప్‌లను ప్రోత్సహించేలా కృషి చేయనున్నారు. ఇప్పటికే ఓ దఫా జరిగిన చర్చలతో డీబీటీ ప్రతినిధుల బృందం సీడీఎఫ్‌డీని సంప్రదించి పలు అంశాలపై చర్చించింది.